సాక్షి సంగారెడ్డి

శనివారం, 8, జూన్, 2024



పాలన పట్టాలెక్కేనా?
ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో జిల్లాలో పాలన పరుగు పెట్టనుంది.
వివరాలు 8లో ▸



రాజీయే రాజమార్గం
కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు.
వివరాలు 8లో ▸



రహదారులు అధ్వానం
చిన్నపాటి వర్షాలకే జిన్నారం మండలంలోని రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి.
వివరాలు 9లో ▸

నల్లాల లెక్క.. ఇక పక్కా

- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

మిషన్ భగీరథ పథకం పనితీరు పరిశీలన



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా తీరు తెన్నులపై ప్రభుత్వం ప్రత్యేక సర్వేకు శ్రీకారం చుట్టింది. ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యంగా గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం పనితీరును తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించింది. వారు తమ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి భగీరథ పథకం నల్లా కనెక్షన్ల వివరాలను తెలుసుకోనున్నారు. సోమవారం నుంచి ఈ సర్వేను జిల్లాలో ప్రారంభించాలని భావిస్తున్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నారు. చిన్న గ్రామాల్లో కార్యదర్శులు సర్వే చేయాల్సి ఉంటుంది. పెద్ద పంచాయతీల్లో కార్యదర్శులతో పాటు, అంగన్‌వాడీలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో చేయిస్తారు.

యాప్‌లో వివరాలు నమోదు

తాగునీటి సర్వే కోసం ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందించారు. సెక్రెటరీలు ఈ యాప్‌లోనే నల్లా కనెక్షన్ల వివరాలు నమోదు చేస్తారు. ప్రతి సెక్రటరీకి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ కేటాయిస్తారు. గ్రామంలో ఎన్ని నివాసిత ప్రాంతాలు (హ్యాబిటేషన్లు) ఉన్నాయి. అందులో ఎన్ని ఇండ్లు ఉన్నాయి. ఎన్ని ఇండ్లకు మిషన్‌భగీరథ కనెక్షన్లు ఉన్నాయి. ఇంకా కొత్త కనెక్షన్లు ఇవ్వాల్సిన ఇండ్లు ఏమైనా ఉన్నాయా?.. ఉన్న కనెక్షన్ల ద్వారా ఇంటి అవసరాలకు సరిపోయేంత నీరు సరఫరా అవుతుందా? అనే వివరాలను నమోదు చేయాలని నిర్ణయించారు. ఇంటి ఫొటోతో పాటు, నల్లా కనెక్షన్ ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒక నల్లా కనెక్షన్ ఉన్న ఇంట్లో ఎన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆ కుటుంబాల్లోని సభ్యుల సంఖ్య ఎంత?.. తదితర వివరాలు యాప్‌లో నమోదు చేస్తారు. ఎంత సమయం నల్లా వస్తోంది. ఇంకా నీటి సరఫరా పెంచాల్సిన అవసరం ఏమైనా ఉందా.? వంటి అంశాలను కూడా ఈ సర్వేలో పరిశీలించనున్నారు.

ఔటర్ బయట.. మున్సిపాలిటీలు వదిలేసి..

జిల్లాలో అన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఈ నీటి సర్వే చేపట్టనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని సర్వే నుంచి మినహాయించే అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలో జీహెచ్ఎంసీ చేసే అవకాశాలున్నాయి. అలాగే మున్సిపాలిటీల్లో కూడా ఈ సర్వే మినహాయించనున్నట్లు తెలిసింది. మిషన్ భగీరథ తాగునీటి కనెక్షన్లపై ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సర్వే కోసం కార్యదర్శులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పది రోజుల్లో ఈ సర్వేను పూర్తి చేయాలని సూచించారు.

కొత్త పైపులు అవసరమా?

మిషన్‌భగీరథ తాగునీటి పథకం కింద జిల్లాలో ప్రస్తుతం సుమారు 2.53 లక్షల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. సింగూరు జలాశయం వద్ద నిర్మించిన గ్రిడ్ నుంచి జిల్లాలో నీటి సరఫరా జరుగుతోంది. 2016లో ఈ పథకం పనులు ప్రారంభం కాగా, రెండేళ్ల క్రితం వరకు పనులు కొనసాగాయి. అయితే ఈ పథకం ప్రారంభించినప్పటికీ.. ఇప్పటికీ ఇండ్ల నిర్మాణాలు భారీగా జరిగాయి. మరోవైపు కొత్త కాలనీలు కూడా వెలిశాయి. దీంతో చాలా కాలనీలకు మిషన్‌భగీరథ తాగునీటి కనెక్షన్లు ఇవ్వలేదు. వీటికి కనెక్షన్లు ఇవ్వాలంటే ఏమైనా కొత్తగా పైప్‌లైన్లు వేయాల్సి ఉంటుందా అనే వివరాలు ఈ సర్వే తేలే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



సంగారెడ్డి టౌన్ : గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణ కోసం నియమించిన పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న గ్రూప్–1 ప్రిలిమ్స్ ఏర్పాట్లను చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు పర్యవేక్షించాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ సెంటర్లను పరిశీలించాలన్నారు. ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు పరీక్షకు వచ్చే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తెలిపారు. జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సుమారు 9672 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌లైన్ నంబర్ 08552 76155లో సంప్రదించాలని కోరారు.

పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలి

సంగారెడ్డి టౌన్ : మహిమ మినిస్ట్రీస్ హోమ్ ఫర్ బాయ్స్‌లోని పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని హాస్టల్‌ను ఆయన సందర్శించారు. పరిసరాలు, వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

యథాతథంగా ప్రజావాణి

సంగారెడ్డి టౌన్ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ నుంచి యథాతథంగా నిర్వహిస్తామని కలెక్టర్ క్రాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఇన్నిరోజులు ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బోనాల ఊరేగింపులో గిరిజనులు

నారాయణఖేడ్: మండలంలోని చల్లగిద్ద తండాలో శుక్రవారం త్రయాహ్నిక జగదాంబ సేవాలాల్, రాంరావ్ మహారాజ్ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, హోమం, అలంకరణ, మహాహారతి తదితర పూజలు చేశారు. అలాగే గిరిజన సంప్రదాయంలో భోగ్ భండార్ కార్యక్రమాలను పురోహితులు మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం పల్లకీ సేవ, బోనాల ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ చాందీబాయి రాంచందర్, తహసీల్దార్ రాజా ప్రతాప్‌సింగ్, రమేష్ చౌహాన్ పాల్గొన్నారు.



విజయోత్సవ ర్యాలీలో సురేశ్ షెట్కార్, సంజీవరెడ్డి

ఐక్యంగా 'జహీరాబాద్' అభివృద్ధి

- ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- ఖేడ్‌లో విజయోత్సవ ర్యాలీ

నారాయణఖేడ్: ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా సంజీవరెడ్డిని గెలిపించినందుకు కలిసికట్టుగా పనిచేస్తూ.. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. ఎంపీగా గెలుపొందిన సందర్భంగా శుక్రవారం ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ దుర్గాభవానీ మాత ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి పట్టణంలోని రాజీవ్ చౌక్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఓపెన్ టాప్ జీపులో ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు నగేశ్ షెట్కార్, టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, శంకరయ్యస్వామి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి రాకేశ్ షెట్కార్, గిరిజ షెట్కార్, శివానీ షెట్కార్‌లతో కలిసి కార్యకర్తలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం వారు ప్రసంగించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కలిసికట్టుగా పనిచేసి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. రెండు పర్యాయాలు గెలిచిన బీబీపాటిల్ అభివృద్ధి ని విస్మరించారని విమర్శించారు.

చెరువు ఆక్రమణపై విచారణ



చెరువు భూములను పరిశీలిస్తున్న నరోత్తం

జహీరాబాద్ టౌన్: కబ్జాకు గురైందనే ఫిర్యాదుతో కోహీర్ మండలం చింతల్‌ఘాట్ గ్రామ పరిధిలో గుండం చెరువును రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహిస్తున్నారు. 113, 114 సర్వే నంబర్‌లో 23 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉంది. 23 ఎకరాల్లో 6 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండగా మిగతాది పట్టా భూమి ఉంది. 65వ జాతీయ రహదారికి పక్కన ఉండడం వల్ల ఈ భూమి రేటు రూ.కోట్లల్లో ఉంది. ఇక్కడ ఎకరం భూమి రూ.5 కోట్ల వరకు పలుకుతుంది. ఖాళీగా ఉన్న చెరువుకు సంబంధించి పట్టా భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. ఈ మేరకు దర్జాగా భూమిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కబ్జా చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్డీఓ రాజు సర్వేకు ఆదేశించారు. ఈ మేరకు అధికారులు రెండు రోజుల నుంచి చెరువు వద్ద సర్వే చేస్తున్నారు. ఈ ప్రక్రియలో నీటి పారుదల శాఖ ఈఈ విజయ్‌కుమార్, కోహీర్ తహసీల్దార్ బాలశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఇలా ఉండగా కబ్జాకు గురైన గుండం చెరువును మాజీ టీఎస్ఎస్‌సీసీడీసీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు నరోత్తం శుక్రవారం సందర్శించారు. అధికారులు చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెరువుకు సంబంధించిన ఆరు ఎకరాల భూమి కబ్జాకు గురైందన్నారు. నియోజకవర్గంలో పలు చెరువులకు సంబంధించిన భూములు కబ్జాకు గురవుతున్నాయని జెడ్పీ సమావేశంలో ప్రస్తావించానని చెప్పారు. అయినా అధికారులు స్పందించలేదన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అందోల్ అభివృద్ధికి రూ.211 కోట్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

జోగిపేట(అందోల్): అందోల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.211 కోట్ల నిధులను మంత్రి దామోదర రాజనర్సింహ ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. సింగూరు ప్రాజెక్టు కాల్వలను సీసీ లైనింగ్ కోసం రూ.168.30 కోట్లు, అందోల్‌లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు రూ.43 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కీ.శే ఎం.బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు కాల్వలకు సంబంధించి అందోల్, పుల్కల్, చౌటకూర్, మునిపల్లి, సదాశివపేట మండలాల్లోని కాల్వల సీసీ లైనింగ్ పనులను చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. 2014లో దామోదర డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు సాగునీరందించేందుకు సింగూరు ప్రాజెక్టు కాల్వల నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. అందోల్‌లో నిర్మించతలపెట్టిన నర్సింగ్ కళాశాల సివిల్ వర్క్స్, ఫర్నిచర్ కోసం రూ.43 కోట్లు కేటాయించింది. బీఎస్‌సీ నర్సింగ్ కోర్సులో 60 సీట్ల ఇన్‌టెక్ కెపాసిటీతో కాళోజీ నారాయణరావు యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వరంగల్ నుంచి అఫిలియేషన్ పొంది, ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఢిల్లీ) నుంచి క్లియరెన్స్ పొందారు. సివిల్ పనులు, పరికరాలు, ఫర్నిచర్ సేకరణకు తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీఈ))కి అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఐదు నెలల్లోనే రూ.500కోట్లు

దామోదర్ రాజనర్సింహ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఐదు మాసాల్లోనే నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.500 కోట్లు మంజూరు చేయించారని మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, కౌన్సిలర్లు చిట్టిబాబు, నాగరాజు, దుర్గేష్, హరికృష్ణ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ కౌన్సిలర్ పిట్ల లక్ష్మణ్, నాయకులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, గుర్రం కృష్ణ, వి.సతీష్, మధు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు అర్థరహితం : వంటేరు

గజ్వేల్: మెదక్ ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపునకు మాజీ మంత్రి హరీశ్‌రావు కారణమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడటం తగదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, రేవంత్‌రెడ్డి అనాలోచితంగా మాట్లాడటం దారుణమన్నారు. ఇప్పటికైనా అర్థరహితమైన విమర్శలను మానుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌కు గెలుపోటములు సహజమేనని, ఓడినా, గెలిచినా తెలంగాణ ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. మెదక్ ఎంపీ ఎన్నికలకు సంబంధించి గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు 20వేల మెజారిటీ అందించిన నియోజకవర్గ ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు.

కొత్త వంగడాలపై దృష్టి సారించండి

పాపన్నపేట(మెదక్): రైతులు కొత్త వంగడాలపై దృష్టి సారించాలని కాంగ్రెస్ మెదక్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో జరుగుతున్న స్టేట్ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమావేశంలో వివిధ దేశాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారన్నారు. రైతులు మూస పద్ధతిలో పంటలు పండించకుండా మారుతున్న పరిస్థితులు, కొత్త వంగడాలు, అధిక దిగుబడి వచ్చే వరి పంటను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటూ దిగుబడులు పెంచుకోవాలన్నారు. అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డబుల్ బెడ్రూం'లు ఇవ్వాల్సిందే



ఆందోళనకు దిగిన లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

- ఇళ్ల లబ్ధిదారుల డిమాండ్
- మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన

గజ్వేల్‌రూరల్: డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు ఆందోళన బాట పట్టారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. సంగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ సందర్భంగా డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు గృహ ప్రవేశాలు చేయించకుండా ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది క్రితం లబ్ధిదారుల ఎంపిక నిర్వహించి గృహ ప్రవేశాలు చేయించకుండా ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. గతంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నాకు దిగగా ఆర్డీవో వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. ఇదే క్రమంలో ఎన్నికలు ముగిసిన తర్వాత డబుల్ బెడ్రూంల పంపిణీకి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ యాదవరెడ్డి సైతం ప్రకటించారని గుర్తు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి లబ్ధిదారులు ఎమ్మెల్సీ యాదవరెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి లబ్ధిదారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా... లబ్ధిదారులంతా ఎమ్మెల్సీతో ఆందోళనకు దిగారు. అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ అప్పటి కలెక్టర్ నేతృత్వంలో లబ్ధిదారుల ఎంపిక జరిగిందని అన్నారు. వచ్చే బుధవారం ప్రస్తుత కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో సమస్యకు పరిష్కారం లభించకపోతే మరోసారి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని లబ్ధిదారులు హెచ్చరించి ఆందోళనను విరమించారు.

వ్యక్తిగత విమర్శలను సహించబోం

నర్సాపూర్: వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని నర్సాపూర్ కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి హితవు పలికారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు తనపై వ్యక్తిగత విమర్శలు చేయడమే పనిగా కొంతమంది కాంగ్రెస్ నాయకులు పెట్టుకున్నారని మండిపడ్డారు. తమకు సంస్కారం ఉన్నందున వారిపై వ్యక్తిగత విమర్శలకు దిగడం లేదన్నారు. వారు పద్ధతి మార్చుకోని పక్షంలో తగిన విధంగా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. తాను ఐదేళ్ల క్రితం పార్టీ మారానని, అయితే కొందరు కాంగ్రెస్ నేతలు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఏ పార్టీలో ఉన్నా క్రమశిక్షణ గల కార్యకర్తగా ఉంటానని స్పష్టం చేశారు. ప్రజల కోసం పని చేస్తానన్నారు. సీఎం రేవంత్ ఏ పార్టీ నుంచి వచ్చి కాంగ్రెస్‌లో చేరారో అందరికీ తెలుసునన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటేనని ఆపార్టీ నాయకులు ఆరోపించడాన్ని ఖండించారు. ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చినప్పుడు ఆయన్ను బడేభాయ్ అని, తాను చోటేభాయ్ అని సీఎం చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీన్ని బట్టి ఎవరికి ఎవరితో సంబంధాలు ఉన్నాయో? ప్రజలు గమనిస్తున్నారని వెల్లడించారు. అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులకు ధ్యాస లేదన్నారు. పీజీ, డిగ్రీ కాలేజీలు తన హయాంలోనే మంజూరయ్యాయన్నారు.

సింగూరులో మత్స్య సిరులు

- ప్రాజెక్టు వద్ద జోరుగా చేపల విక్రయాలు
- మృగశిర కార్తె రోజు మరింత డిమాండ్
- టన్నుల కొద్ది అమ్మకాలు



సింగూరు ప్రాజెక్టు వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న చేపలు

పుల్కల్(అందోల్): మృగశిర కార్తె మొదలైతే చాలు రుతుపవనాలు ప్రవేశించి తొలకరి పలకరిస్తుంది. దీంతో రైతులు ఏరువాకకు సిద్ధమవుతారు. పొలాలు దున్ని విత్తనాలు విత్తడం ప్రారంభిస్తారు. అంతేకాకుండా మృగశిర కార్తె మొదటి రోజు చేపలు తినడం వల్ల ఎలాంటి జబ్బులు రావని మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం. ఈ రోజు చేపలు తినడం వల్ల ముఖ్యంగా గుండె జబ్బులు, ఆస్తమా రోగులకు మంచిదంటారు. దీంతో మృగశిర కార్తె రోజు చేపల మార్కెట్లు కిటకిటలాడుతాయి. చెరువులు, కుంటలు, జలాశయాల వద్ద చేపల విక్రయాలు చేపడుతారు. ప్రజలు రకరకాల చేపలను కొనుగోలు చేసి నోరూరించే వంటలు చేసి రుచిచూస్తారు.

'సింగూరు చేప'కు భలే గిరాకీ

సంగారెడ్డి జిల్లాలో ఉన్న ఏకైక భారీ ప్రాజెక్టు సింగూరు. ఇక్కడ లభించే చేపలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. సింగూరు ప్రాజెక్టు మంజీరా నదిపై నిర్మించడంతో ఇక్కడ ప్రవహించే నీటిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో సింగూరు ప్రాజెక్టులో పెరిగే చేపలు చాలా రుచికరంగా ఉంటాయి. ఈ ప్రాజెక్టుల వద్ద ఏడాది పొడవునా చేపలు లభిస్తాయి. మృగశిరరోజు మాత్రం ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి మత్స్యకారులు చేపలు అమ్ముతారు.

లక్షల్లో చేప పిల్లల విడుదల

సింగూరు జలాశయం పరిసర గ్రామాలలో చేపలు పట్టి విక్రయిస్తూ వేల కుంటుంబాలు జీవన సాగిస్తుంటాయి. వీరికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తూ ప్రోత్సాహం అందిస్తుంది. మత్స్యకారులకు రాయితీపై వలలు, దాణా పంపిణీ చేస్తుంది. ప్రతిఏటా సింగూరు జలాశయంలో అరకోటికి పైగా చేప పిల్లలను వదులుతారు.



చేపల వంటకాల విక్రయ కేంద్రం

ప్రస్తుతం సింగూరు జలాశయంలో 14.5 టీఎంసీల నీరు ఉండటంతో మత్స్య సంపద బాగా పెరిగింది. కిలో నుంచి పది కిలోల వరకు చేపలు ఉన్నాయి. లైసెన్స్ ఉన్న మత్స్యాకారులు జలాశయం వద్ద చేపలు అమ్ముతుంటారు. మృగశిర

డ్యాం పరిసరాల్లోనే విక్రయాలు

కార్తె రోజు ఇక్కడ చేపల విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. మామూలు రోజుల్లో కొర్రమీను కిలో రూ. 350కు అమ్ముతామని, మృగశిర కార్తె రోజు మాత్రం రూ.500వరకు విక్రయిస్తామని మత్స్యకారులు చెబుతున్నారు. బొచ్చెలు, రవ్వలు కిలో ధర రూ.150 పలుకుతుందని చెప్పారు.

మృగశిరకు గిరాకీ ఎక్కువ

మంజీరా నది నీటి ప్రవాహం వల్ల సింగూరు జలాశయంలోని మత్స్య సంపద రుచికరంగా ఉంటుందని వినియోగదారులు భావిస్తారు. దీంతో సింగూరులో ఉత్పత్తి అయ్యే చేపలకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. మృగశిర కార్తె రోజు అయితే చేపలు మస్తుగా అమ్ముడుపోతాయి.

– నందికంటి శ్రీనివాస్, మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు, సింగూరు

సింగూరు చేపకు డిమాండ్



సింగూరు చేపలంటే ప్రజలకు క్రేజ్ ఎక్కువ. ఇక్కడ ప్రతీ రోజు చేపల గిరాకీ ఉంటుంది. ప్రభుత్వం రాయితీపై కంటెయినర్ దుకాణాలు సరఫరా చేశారు. పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. దీంతో చేపలతో పలు రకాల వంటకాలు తయారు చేసి విక్రయిస్తాం.

– ముజీబ్, చేపల విక్రయకారుడు, సింగూరు

క్లుప్తంగా

మల్లన్న గుట్టలో పులి సంచారం?

భయాందోళనలో సమీప గ్రామాల ప్రజలు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులోని మల్లన్న గుట్ట ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం పులి సంచరిస్తున్నట్లు మేకల కాపరి చూసి చెప్పడంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన గురవుతున్నారు. హత్నూర బ్రాహ్మణ గూడా గ్రామాల మధ్యలో ఉన్న మల్లన్న గుట్ట ప్రాంతంలో బ్రాహ్మణ గూడా గ్రామానికి చెందిన మేకలు కాపరి రమేశ్ అనే వ్యక్తి పులి కనిపించిందని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఎస్ఐ సుభాష్ అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుకార్లు షికార్లు అయ్యాయి. శనివారం ఉదయం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తామని ఎస్ఐ తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు



పతకాలతో క్రీడాకారులు

సిద్దిపేటజోన్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. హన్మకొండలో జరిగిన మీట్‌లో హై జంప్‌లో ఇంద్రాణి బంగారు పతకం, జావెలిన్‌త్రో లో శ్రీకాంత్ బంగారు పతకం, వివిధ పోటీల్లో ఆనంద, సంతోశ్, గణేశ్, జితేశ్, అభిషేక్‌లు వెండి, కాంస్య పతకాలు సాధించారు. వీరిని జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు సాయిరాం, పరమేశ్వర్, రవీందర్ రెడ్డి, వెంకట్ స్వామి, రామేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు అభినందించారు.

డిగ్రీ పరీక్షలో ఐదుగురు డిబార్

ఆందోళనకు దిగిన విద్యార్థులు



చీఫ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

రామాయంపేట(మెదక్): డిగ్రీ ఫైనల్ ఇయర్ ఇంగ్లిష్ పరీక్షలో ఐదుగురు విద్యార్థులు డిబార్ కావడం రామాయంపేటలో ఆందోళనకు దారితీసింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమశాఖ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 246 మంది విద్యార్థులు డిగ్రీ పరీక్ష రాశారు. ఎగ్జామ్ అబ్జర్వర్‌గా వచ్చిన వ్యక్తి ఐదుగురు విద్యార్థులను పట్టుకొని కాపీ కొడుతున్నారనే ఆరోపణలతో డిబార్ చేశారు. అయితే ఆ ఎగ్జామ్ అబ్జర్వర్ ప్రస్తుతం ఏ కళాశాలలో పని చేయకపోయినా యూనివర్సిటీ నుంచి లెటర్ తెచ్చుకొని విధులు నిర్వర్తించారని విద్యార్థులు ఆరోపించారు. దీంతో విద్యార్థులంతా కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వచ్చి వారిని సముదాయించారు. ఈ విషయమై విద్యార్థులు చీఫ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. అబ్జర్వర్‌కు విద్యార్థులను డిబార్ చేసే అధికారం ఉండదని, కేవలం ఎగ్జామ్ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే అధికారం ఉంటుందని తెలిసింది.

కల్తీ డీజిల్ పోశారని ఆందోళన

వట్‌పల్లి(అందోల్): కల్తీ డీజిల్ పోశారని ఆరోపిస్తూ ఓ వ్యక్తి పెట్రోల్ బంకు వద్ద ఆందోళనకు దిగాడు. ఈ ఘటన అందోలు మండల పరిధిలోని రాంసాన్‌పల్లి గ్రామ శివారులోని జియో పెట్రోల్ బంకు వద్ద చోటు చేసుకుంది. జోగిపేట పోలీసుల కథనం మేరకు.. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన పోచయ్య గురువారం సాయంత్రం జియో పెట్రోల్ బంకులో రూ.3,500 వరకు డీజిల్ డబ్బాలో పోసుకొని వెళ్లాడు. తన ట్రాక్టరులో కొంత పోసి చూడగా స్టార్ట్ కాలేదు. వెంటనే డీజిల్‌ను పరిశీలించి బంకుకు వెళ్లి కల్తీ డీజిల్ పోశారని నిర్వాహకులతో వాగ్వాదానికి దిగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు బంక్‌కు వెళ్లి కల్తీ జరిగిందని ఆరోపిస్తున్న డీజిల్‌ను తీసుకెళ్లారు. ఈ విషయమై బంక్ యాజమాన్యంతో మాట్లాడగా డీజిల్ కల్తీ జరగలేదని, పెట్రోలు నాణ్యత కోసం కలిపే పదార్థాలతో డీజిల్ రంగుమారిందే తప్ప ఎటువంటి కల్తీ జరుగలేదన్నారు.

పాలన పట్టాలెక్కేనా?

నేటితో ముగియనున్న ఎన్నికల కోడ్

- జిల్లాలో ప్రారంభంకానున్న పనులు
- త్వరలోనే ప్రజావాణి కార్యక్రమం
- వేగం పుంజుకోనున్న సంక్షేమ పథకాల అమలు
- ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టనుంది. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలలకే పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చింది. దాదాపు మూడు నెలలపాటు కోడ్ కొనసాగింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఆ కోడ్ కొనసాగుతుండగానే వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వచ్చింది. నేటి (శనివారం)తో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కూడా ముగుస్తుంది.

– సాక్షి, సిద్దిపేట

గతేడాది అక్టోబర్ 9వ తేదీ నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు అసెంబ్లీ, మార్చి 16 నుంచి జూన్ 6వ తేదీ వరకు పార్లమెంట్ ఎన్నికల కోడ్, అనంతరం రెండు రోజులు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉంది. ఇలా వరుస ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ పరిధిలో సిద్దిపేట జిల్లాకు చెందిన చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలు వస్తాయి. దీంతో ఎమ్మెల్సీ కోడ్ సైతం జిల్లాలో కొనసాగుతుంది. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ఆరు నెలల్లో మూడు నెలల పాటు ఎన్నికల కోడ్‌లోనే కొనసాగింది. దీంతో ప్రభుత్వం నూతనంగా అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

నిధులు మంజూరైనా.. నిలిచిన పనులు

ఎన్నికల కోడ్‌లతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి అభివృద్ధి నిధుల కింద రూ.10 కోట్లను మంజూరు చేశారు. అందులో రూ.2 కోట్లను ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు, అలాగే రూ.కోటి తాగు నీటి సరఫరా కోసం, మిగితా డబ్బులు పలు అభివృద్ధి పనులకు కేటాయించనున్నారు. కేటాయించిన కొద్ది రోజులకే ఎన్నికల కోడ్ రావడంతో ఎస్టిమేషన్ దశలలోనే పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి ఎన్నికల కోడ్ వరకు ఎంపికైన వారికి మాత్రమే అందుతోంది. ప్రజాపాలనలో భాగంగా ఐదు గ్యారంటీలు 11 పథకాలకు 14,56,516 దరఖాస్తులు వచ్చాయి. ఎన్నికల కోడ్‌తో వివిధ పథకాలకు అర్హుల ఎంపిక పూర్తి స్థాయిలో జరగలేదు. నేడు కోడ్ ముగియగానే అర్హుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రభుత్వ హామీల అమలు వేగవంతం కానున్నాయి. అలాగే రైతు రుణ మాఫీ సైతం జరగనుంది.

ప్రారంభం కానున్న ప్రజావాణి

ప్రజల సమస్యలను విన్నవించుకునేందుకు నిర్వహించే ప్రజావాణి మూడు నెలలుగా ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయింది. దీంతో ప్రజల సమస్యలు పేరుకుపోయాయి. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పునఃప్రారంభించనున్నారు. ప్రజలు తమ సమస్యలు విన్నవించుకొనేందుకు రానున్నారు.ఈ ప్రజావాణిలో జిల్లా అధికారులు అందరూ పాల్గొననుండటంతో సమస్యలు త్వరగా పరిష్కరామయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు.

నేరేడు.. లాభాలు బోలెడు

- ఔషధ పోషకాల నిధిగా అల్లనేరేడు పండ్లు
- పలు రకాల వ్యాధులు దూరం
- మార్కెట్‌లో మంచి డిమాండ్

మిరుదొడ్డి(దుబ్బాక): తియ్యదనం, పులుపు, వగరు మేలు కలయికే అల్ల నేరేడు పండు. నల్లగా నిగనిగలాడే అల్ల నేరేడు పండ్లను చూస్తే ఎవ్వరికైనా నోరూరాల్సిందే. సహజ సిద్ధంగా లభించే ఫలాలల్లో అల్ల నేరేడు పండ్లు ప్రముఖంగా నిలుస్తాయి. ప్రకృతిలో లభించే పండ్లు ఎన్ని ఉన్నా సరే సినీ, జానపద గేయ రచయితలు మాత్రం అల్లనేరేడు పండ్లపై పాటల రూపంలో బాణీలు కట్టడం విశేషం. ఏ పండ్లకు లేని పొడుపు కథలు సైతం ఒక్క అల్లనేరేడు పండ్లకు ఉండటం మరింత విశేషంగా చెప్పుకోవచ్చు.



అల్ల నేరేడు పండ్లు

పలువురికి ఉపాధి సైతం

ప్రతీ ఏడాది ఏప్రిల్ నెలలో పూత కాత మొదలై జూన్, జూలై వరకు పండ్లు పుష్కలంగా లభిస్తాయి. సేను సెలకల్లో సహజ సిద్ధంగా దొరికే అల్లనేరేడు పండ్లతో కొందరికి మంచి ఉపాధిగా మారుతోంది. మార్కెట్లో విరివిగా లభించే అల్లనేరేడు పండ్లకు మంచి డిమాండ్ ఏర్పడుతుంది. ఒక్క పండులోనే కాకుండా అల్లనేరేడు ఆకులు, బెరడులో కూడా మంచి ఔషధ పోషకాలు నిక్షిప్తమై ఉన్నాయని డాక్టర్లు సైతం చెబుతున్నారు. పండ్లల్లో ఆమ్లాలు, విటమిన్లు, సోడియం, పొటాషియం, ఐరన్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయని సెలవిస్తున్నారు. పండ్లల్లో ఐరన్ పుష్కలంగా లభిస్తుండటంతో రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా రక్త హీనతను తగ్గిస్తాయంటున్నారు. ముఖ్యంగా మధుమేహ వ్యాధిని చక్కగా నియంత్రిస్తుందంటున్నారు డాక్టర్లు.

గుండె వ్యాధులు నివారణ



ఫలాలలో చెప్పుకోదగిన పండ్లల్లో నేరేడు పండ్లు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. గుండె సంబంధిత వ్యాధులను నయం చేస్తాయి. రక్తపోటును నివారించడమే కాకుండా కాలేయ పని తీరును మెరుగు పరుస్తుంది. మోతాదుగా తింటే ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. అధిక మోతాదులో పండ్లను తింటే మాత్రం వెగటు పుట్టడమే కాకుండా మలబద్ధకం సమస్య వస్తుంది. పండ్లలో సీ విటమిన్ పుష్కలంగా ఉండటం వల్ల రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు, ఎముకలకు పరిపుష్టిని ఇస్తుంది.

– డా. అమీనా సుల్తానా, పీహెచ్‌సీ, మిరుదొడ్డి

కబ్జా కోరల్లో పండ్లబోర కుంట



కుంటను కబ్జా చేసి పొలంగా మారుస్తున్న దృశ్యం

- అక్కన్నపేటలో నష్టపోతున్న ఆయకట్టు రైతులు
- కన్నెత్తి చూడని ఇరిగేషన్ అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): కబ్జాదారులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కుంటలను సైతం ఆక్రమిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అక్కన్నపేట మండలం మైసమ్మవాగు తండా గ్రామ పరిధిలోని రంగన్నకుంట, మబ్బు కుంట తండాల మధ్యనున్న పండ్ల బోరకుంట కబ్జాకు గురవుతోంది. 486 సర్వే నంబరలో సుమారుగా 2 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న కుంట శిఖాన్ని కొందరు సమీప రైతులు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. మత్తడి ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. క్రమక్రమంగా శిఖం భూమిని ఆక్రమిస్తూ కుంట ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కబ్జా రాయుళ్లపై చర్యలు తీసుకొని, కుంట శిఖం భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ రమ్యశ్రీను సంప్రదించగా కుంట కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి రాలేదని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కుంట శిఖం వద్ద జరుగుతున్న పనులను నిలిపివేయిస్తాం.

మా కూతురు ప్రాణాలు కాపాడండి

- గుండె జబ్బుతో బాధపడుతున్న చిన్నారి
- దాతల సాయం కోరుతున్న తల్లిదండ్రులు



నారాయణఖేడ్: తమ కూతురు ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు దాతలను వేడుకుంటున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఖేడ్ మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటకు చెందిన బేగరి సాయిలు, నందిని దంపతుల కూతురు సాయి పల్లవి(6) ఏడాదిన్నర నుంచి గుండె జబ్బుతో బాధపడుతుంది. సాయిలు గ్రామ పంచాయతీ తాత్కాలిక ట్రాక్టర్ డ్రైవర్ కాగా, తల్లి వ్యవసాయం కూలీగా పని చేస్తూ జీవిస్తున్నారు. పాపకు మూడు నెలల కిందట నిమ్స్ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ చేయించగా రూ.6లక్షల వరకు ఖర్చు అయ్యింది. ప్రస్తుతం పాప గుండెలో ఇన్‌ఫెక్షన్ రావడంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తిరిగి చికిత్స చేయడానికి రూ.6 నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. నిరుపేద కుటుంబమైన తమ వద్ద అంత డబ్బు లేదని, దాతలు ఎవరైనా ఉంటే సాయం చేయాలని కోరుతున్నారు. సహాయం చేసే వారు 63050 37192 కు ఫోన్ పే లేదా, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపించాలని వేడుకుంటున్నారు.

గొర్రె పిల్లను కాపాడబోయి కాపరి మృతి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

దుబ్బాకరూరల్: చెరువులో మునుగుతున్న గొర్రె పిల్లను కాపాడబోయి కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గూడురు పెద్ద మల్లయ్య(52) రోజు మాదిరిగానే గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. ఆయనతోపాటు మరో ఇద్దరు గొర్రెలను ఒకే చోట మేపుతున్నారు. అందరూ వారి గొర్రెలకు నీళ్ల తాపడానికి గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లారు. ఒక గొర్రె పిల్ల నీళ్ల తాగడానికి వెళ్లి అందులో మునిగి పోతుండగా గమనించిన మల్లయ్య కాపాడటానికి నీటిలోకి వెళ్లాడు. గొర్రె పిల్లను గట్టుకు చేర్చి మల్లయ్య మాత్రం నీటిలో మునిగిపోయాడు. తోటి కాపర్లు గమనించి ఆరుపులు, కేకలు వేయడంతో గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. మత్స్యకారుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ గంగరాజ్ తెలిపారు.

జేసీబీ గుంతలో పడి యువకుడు

మర్కూక్(గజ్వేల్): జేసీబీ గుంతలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పాములపర్తి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన మునిగడప ఆంజనేయులు (19) గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో పలు చోట్ల వెతికారు. శుక్రవారం సాయంత్రం పాములపర్తి సమీపంలోని జేసీబీ గుంతలో పడి విగత జీవిగా కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలుజారి చెరువులో పడి వృద్ధుడు

దుబ్బాక: ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజు కథనం మేరకు.. లచ్చపేటకు చెందిన చెట్ల నర్సయ్య (75) గురువారం సాయంత్రం మరుగుదొడ్డి కోసం ఇంటి సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు చెరువు తూం వద్ద కాలుజారి నీళ్లలో బోర్లా పడిపోయాడు. అక్కడున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నర్సయ్యను బయటకు తీసి సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు మునేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తా.. ఆత్మహత్యా?

చెరువులో గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం



జయశ్రీ మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు

పటాన్‌చెరు టౌన్: చెరువులో గల్లంతైన మహిళ మృతదేహమై లభ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ము సాయిరాం హిల్స్‌లో నివాసం ఉండే రవి తేజ మొబైల్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రవితేజ, భార్య జయశ్రీ ఇద్దరూ జనవరిలో మ్యూచువల్ డైవర్స్ అప్లయ్ చేసుకున్నారు. అప్పటి నుంచి జయశ్రీ (25) ఏపీలోని పిఠాపురంలో తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. గత నెల 26వ తేదీన రవితేజ తండ్రి జగన్మోహన్ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న జయ శ్రీ అత్తగారింటికి వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో భర్త, నాలుగేళ్ల కూతురితో కలిసి అమీన్‌పూర్ పెద్ద చెరువు చూడటానికి వెళ్లింది. భర్త పాపతో కొంచెం దూరంలో ఉండగా జయశ్రీ ప్రమాదవశాత్తు పడిందా లేదా దూకి ఆత్మహత్యకు పాల్పడిందా తెలియదు కానీ చెరువులో పడిపోయింది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రేటర్ విపత్తుల బృందం వచ్చి గాలించి జయశ్రీ మృతదేహాన్ని సాయంత్రం బయటికి తీశారు. ఏపీలోని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని తెలిపారు.

చెట్టును ఢీకొన్న బైక్ : ఒకరి మృతి



ఘటనా స్థలంలో గాయాలతో మల్లేశం

కౌడిపల్లి(నర్సాపూర్): బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లి బట్టమ్మగుడి సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి కథనం మేరకు.. మండల కేంద్రమైన కొల్చారం గ్రామానికి చెందిన మంగళి మల్లేశం(34) శుక్రవారం పని ఉందని బైక్‌పై కౌడిపల్లికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. కౌడిపల్లి బట్టమ్మ గుడి సమీపంలో జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న మర్రిచెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశం తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య స్వప్న, కొడుకు, కూతురు ఉన్నారు. మల్లేశం కొల్చారం మండలంలోని ఓ దిన పత్రిక విలేకరిగా పని చేస్తున్నాడు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపు తూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. పట్టణంలోని పలు చౌరస్తాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల కిందట వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 30 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి 30 మందికి రూ.14,600 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడుగురికి సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ శ్రావణ్ కుమార్ కథనం మేరకు.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

రాజీయే రాజమార్గం

నేడు జాతీయ లోక్ అదాలత్

- చిన్న, పెద్ద, దీర్ఘకాలిక కేసులు సత్వరమే పరిష్కారం
- కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- అవగాహన కల్పించిన న్యాయవాదులు
- సంగారెడ్డి జిల్లాలో 9 బెంచీలు ఏర్పాటు

లోక్ అదాలత్ కోసం నిర్వహించిన సమావేశం



సంగారెడ్డి టౌన్: కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా, జిల్లాలోని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. కక్షిదారులను ఒప్పించి సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులను పరిష్కరించేలా కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమంపై జిల్లా వ్యాప్తంగా ఆయాకోర్టుల పరిధిలో న్యాయవాదులు, పోలీసు అధికారులు, బ్యాంకర్లు, ఇన్సూరెన్స్ అధికారులకు అవగాహన కల్పించారు. రాజీయే రాజమార్గమని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జడ్జీలు సూచిస్తున్నారు. శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.


పెండింగ్ కేసులు ఎక్కువగానే..

జిల్లా వ్యాప్తంగా పెండింగ్ కేసులు ఎక్కువ ఉన్నాయని వాటిని పరిష్కరించుకోవాలన్నారు. విద్యుత్, టెలిఫోన్ రికవరీ తదితర కేసులు వస్తాయి. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ తగాదాలు, కుటుంబ తగాదాలు, రోడ్డు ప్రమాదాలు, మోటార్ వెహికల్ కేసులు, బ్యాంకుల రికవరీ కేసులు, ఆస్తి తగాదాలు ఇన్సూరెన్స్, చెక్ బౌన్స్ కేసులు, క్రిమినల్ కాంపౌండ్ కేసుల వంటివి రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

జిల్లా వ్యాప్తంగా 9 బెంచీలు

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి జిల్లా వ్యాప్తంగా సంగారెడ్డిలో ఐదు బెంచీలు, జోగిపేటలో ఒకటి, నారాయణఖేడ్‌లో ఒకటి, జహీరాబాద్‌లో రెండు మొత్తం 9 బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. పెండింగ్ కేసులను తొందరగా పరిష్కరించేందుకు న్యాయవాదులు, పోలీస్ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. పెండింగ్ కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతున్న కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాదులు సూచిస్తున్నారు.


విజయవంతం చేయాలి



జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయడానికి జిల్లా వ్యాప్తంగా 9 బెంచీల ద్వారా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నాం. న్యాయవాదులు, పోలీసులు సహకరించాలి. రాజీమార్గం ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించుకోవాలి. శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలి.

– భవానీ చంద్ర, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

సద్వినియోగం చేసుకోవాలి



కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి. పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరువర్గాలు చర్చించి సమస్యను పరిష్కరించుకోవాలి. జిల్లా కోర్టులో శనివారం ఉదయం 10.30 నుంచి జాతీయ లోక్ అదాలత్ ప్రారంభమవుతుంది. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– విష్ణువర్ధన్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు